

చిట్టీ డబ్బులు అడిగితే కుటుంబంపై దాడి

కంతులు పూర్తయినా చిట్టీ డబ్బులు చెల్లించకపోగా బాధిత కుటుంబపై చిట్‌ఫండ్స్ సంస్థ యాజమాన్యం అనుచరులు, సిబ్బందితో దాడికి పాల్పడింది.

-8లో



ఇసుక దిబ్బల కోసం తగువులాట.!

అధికారం వచ్చిందే తడవు అన్నట్లుగా టీడీపీ వర్గీయులు పేట్రేగిపోతున్నారు. మనకెవరూ అడ్డూ, అదుపు లేరనేలా ఆక్రమణలకు పాల్పడుతున్నారు.

-8లో

మదనపల్లె : టమాటా ధరలు (10 కిలోలు)

	కనిష్టం	గరిష్టం
మొదటిరకం	రూ.80	రూ.96
రెండోరకం	రూ.60	రూ.70

మార్కెట్‌కు వచ్చిన మొత్తం సరుకు : 1826 మెట్రిక్ టన్నులు



న్యూస్‌రీల్

1 నుంచి చౌకదుకాణాల్లోనే బియ్యం పంపిణీ

లక్కిరెడ్డిపల్లి: జూన్ 1వ తేదీ నుంచి చౌకదుకాణాల్లోనే ప్రజలకు బియ్యం పంపిణీ చేయాలని జిల్లా పౌరసరఫరాల అధికారి రఘురాం పేర్కొన్నారు. బుధవారం లక్కిరెడ్డిపల్లి టౌన్ పరిధిలోని రేషన్ షాపులను ఆకస్మిక తనిఖీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ చౌక దుకాణదారులు తూనిక పరికరాలు, ఈపాస్ మిషన్ సక్రమంగా పనిచేసే విధంగా చూసుకోవాలని సూచించారు.

ముగ్గురు ఉపాధ్యాయుల సస్పెన్షన్

రాయచోటి: పదోతరగతి పరీక్ష పత్రాల మూల్యాంకనంలో మార్కులు పొందుపరచడంలో నిర్లక్ష్యం వహించిన ముగ్గురు ఉపాధ్యాయులను సస్పెండ్ చేసినట్లు జిల్లా విద్యాశాఖాధికారి సుబ్రమణ్యం తెలిపారు. బుధవారం సస్పెన్షన్ ఉత్తర్వులను డీఈఓ పత్రికలకు విడుదల చేశారు. సాంఘికశాస్త్రానికి సంబంధించి ఒక విద్యార్థికి రావాల్సిన మార్కులు తప్పుగా పొందుపరిచారన్నారు. చీఫ్ ఎగ్జామినర్‌గా వ్యవహరించిన శ్రీనాథ్‌రావు (గుర్రంకొండ ఉన్నత పాఠశాల సాంఘిక శాస్త్ర ఉపాధ్యాయుడు), అసిస్టెంట్ ఎగ్జామినర్‌గా వ్యవహరించిన ఎం.మోహన్ (రామసముద్రం జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల) స్పెషలిస్ట్‌గా వ్యవహరించిన కె.రేవతి (రాయచోటి ఏపీ మోడల్ స్కూల్ వ్యాయామ ఉపాధ్యాయురాలు) సస్పెండ్ అయిన వారిలో ఉన్నారని డీఈఓ తెలిపారు.

రుణ ప్రణాళిక పక్కాగా అమలు చేయాలి


రాయచోటి: 2025–26 ఆర్థిక సంవత్సరానికి రూపొందించిన రుణ ప్రణాళికను పక్కాగా అమలు చేయాలని జిల్లా కలెక్టర్ చామకూరి శ్రీధర్ బ్యాంకర్లకు సూచించారు. బుధవారం కలెక్టరేట్‌లో జిల్లాలోని వివిధ బ్యాంకులతో రుణ మంజూరు ప్రణాళిక అమలు, తదితర అంశాలపై కలెక్టర్ సమీక్షా సమావేశాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఎల్‌డీఎం ఆంజనేయులు 2024–25వ ఆర్థిక సంవత్సరానికి 131 శాతం రుణాలు మంజూరు చేశామని, ఇచ్చిన లక్ష్యాలను మించి మంజూరు చేశామని కలెక్టర్‌కు వివరించారు. అనంతరం కలెక్టర్ మాట్లాడుతూ వ్యవసాయం, పరిశ్రమల రంగాలకు విరివిగా రుణాలు మంజూరు చేయాలని ఎస్‌హెచ్‌జీ గ్రూపుల లోన్లకు సంబంధించి పీడీ డీఆర్‌డీఏ సూచించినట్లు డిజిటలైజేషన్ పూర్తయ్యాక రుణ మంజూరు ప్రారంభించాలని సూచించారు. అనంతరం జిల్లా వార్షిక రుణ ప్రణాళిక 2025–26 పుస్తకాన్ని జిల్లా కలెక్టర్ ఆవిష్కరించారు.

అధిక వడ్డీలు ఇచ్చే బ్యాంక్‌లు కొటేషన్ వేయాలి

రాయచోటి టౌన్: రాయచోటి శ్రీ వీరభద్రస్వామి దేవస్థానానికి సంబంధించి బ్యాంక్‌లలో ఉన్న డబ్బుకు అధిక వడ్డీలు చెల్లించే బ్యాంక్‌లు తమ కొటేషన్లు ఈ నెల 31వ తేదీలోగా వేయాలని ఆలయ ఈవో డీవీ రమణారెడ్డి బుధవారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. స్వామి వారికి వివిధ రూపాల్లో వచ్చిన ఆదాయాన్ని పలు బ్యాంక్‌ల్లో ఫిక్స్‌డ్ డిపాజిట్ చేశామని చెప్పారు. అయితే దీనిపై తనిఖీలు నిర్వహించిన రాష్ట్ర దేవదాయశాఖ కమిషనర్ అధిక వడ్డీ చెల్లించే బ్యాంక్‌లో ఫిక్స్‌డ్ డిపాజిట్ చేయాలని సూచించినట్లు తెలిపారు. దేవస్థానానికి సంబంధించి 104 ఫిక్స్‌డ్ డిపాజిట్లు ఉన్నాయని ఈవో తెలిపారు. వీటిలో శాశ్వతపూజకు సంబంధించి 35 బాండ్ల ద్వారా రూ. 3,23,92,509, అన్నదానానికి 30 బాండ్ల ద్వారా రూ.2,30,50,904లు, సేల్ ప్రొసీడ్స్ ఫిక్స్‌డ్ డిపాజిట్ మొత్తం రూ.13,54,041, వెండి రథం ఫిక్స్‌డ్ డిపాజిట్ మొత్తం రూ.11,68,677, సర్‌ప్లస్ ఫండ్ ఫిక్స్‌డ్ డిపాజిట్ మొత్తం 34 బాండ్ల ద్వారా రూ.6,59,68,252.. మొత్తం 104 బాండ్ల ద్వారా రూ.12,39,34,383లు ఉన్నట్లు తెలిపారు. ఈ మొత్తానికి ఏ బ్యాంక్ అయితే అధిక మొత్తంలో వడ్డీ రేట్ ఇస్తుందో ఈ–కొటేషన్స్‌ను దేవస్థానం కార్యాలయంలో అందజేయాలని కోరారు.

అధినేత నోట.. అబద్ధాల మూట

- ‘టీడీపీలో కార్యకర్తే అధినేత..’ సీఎం చంద్రబాబు ప్రకటన
- ఫైరవీకారులు, దోపిడీదారులకే ప్రధాన పీఠమంటున్న ‘తమ్ముళ్లు’
- కడప ఎమ్మెల్యేల చెంతన వలస పక్షులకే ప్రాధాన్యత
- బడుగు బలహీన వర్గాలను తొక్కిపడేస్తున్న నియోజకవర్గ నేతలు
- ఎమ్మెల్యే మాధవి రెడ్డి వైఖరికి నిరసనగా సెల్ టవర్ ఎక్కి మహిళా నేత నిరసన
- 20ఏళ్లు పార్టీలో ఉన్న అధికారంలోకి రాగానే అనాథలయ్యామని ఆవేదన
- మహానాడు సాక్షిగా కడప జిల్లాలో కార్యకర్తలకు అన్యాయమంటూ గగ్గోలు



మహానాడులో ప్రసంగిస్తున్న సీఎం చంద్రబాబునాయుడు



కార్యకర్తలను పట్టించుకోవట్లేదంటూ సెల్ టవర్ ఎక్కిన మహిళా నేత చిప్పగిరి మీనాక్షి

సాక్షి ప్రతినిధి, కడప: ‘తెలుగుదేశం పార్టీలో కార్యకర్తే అధినేత...’ మహానాడు వేదికగా ప్రధాన వక్తల నుంచి జాతీయ అధ్యక్షుడు చంద్రబాబునాయుడు వరకూ పదేపదే వల్లె వేసిన మాట ఇది. ఒక్క రోజు గడవకముందే ఆ మాట అబద్ధమని తేలిపోయింది. పార్టీలో వలసపక్షులకు, పెత్తందారులకు, దోపిడీ ముఠాలకే ప్రధాన పీఠమని తెలిసిపోయింది. ఆ పార్టీకి చెందిన టీడీపీ కడప నగర మహిళ మాజీ అధ్యక్షురాలు చిప్పగిరి మీనాక్షి సెల్‌ఫోన్ టవర్ ఎక్కి నిరసన వ్యక్తం చేయడమే ఇందుకు నిదర్శనంగా నిలిచింది. పార్టీ కోసం కష్టపడ్డ నాయకులకు అధికారంలోకి వచ్చాక నిరాదరణకు గురవుతున్నారని ఆమె ఆవేదనలో స్పష్టమైంది.

- తెలుగుదేశం పార్టీ మీద అధ్యక్షుడు నారాచంద్రబాబు, లోకేష్ మీద నమ్మకంతో ప్రేమతో ఇన్నాళ్లు పార్టీ కోసం కష్టపడ్డ కార్యకర్తలు నిరాదరణకు గురవుతున్నారని అటువంటి కార్యకర్తల ఆవేదన తెలియజేసేందుకు నిరసన చేస్తున్నట్లు మీనాక్షి ప్రకటించారు. ఇరవై ఏళ్లుగా అనేక ధర్నాలు, రాస్తారోకోలు, బంద్‌లు సొంత ఖర్చులతో చేసినా పోలీసు, కోర్టు కేసులు ఎదుర్కొన్నా ఎమ్మెల్యే మాధవీరెడ్డి చర్యలు కారణంగా దూరమయ్యామని ఆవేదన వ్యక్తం చేశారు. కనీసం మహానాడుకు వెళ్లేందుకు కూడా అవకాశం ఇవ్వకుండా వ్యవహరించడంపై తీవ్ర ఆవేదన వ్యక్తం చేశారు. ఇలాంటి వారు జిల్లాలో వందల సంఖ్యలో ఉన్నారని విశ్లేషకులు వెల్లడిస్తున్నారు. పార్టీ జెండా వెన్నంటే ఉన్న నేతలు నేడు కనుమరుగయ్యారు. కడపలో సీటీ అధ్యక్షుడు సానపురెడ్డి శివకొండారెడ్డి విపక్షంలో ధైర్యంగా పార్టీ కోసం పనిచేసినా తాజాగా తెలుగుదేశం పార్టీ నాయకుడని చెప్పుకోలేని పరిస్థితి దాపురించింది. ఏకంగా ఆయనపై హత్యాయత్నం చేశారు. ఎన్నికలల్లో టీడీపీ అభ్యర్థులుగా పోటీచేసిన దుర్గాప్రసాద్, అమీర్‌బాబులాంటి వారు సామాన్య కార్యకర్తల తరహాలో టీడీపీలో ఉండిపోయారు. ఇక ఆలంఖాన్‌పల్లె లక్ష్మిరెడ్డి కుటుంబాన్ని పొమ్మనకుండా పొగబెడుతున్నారు. ఇలా చెప్పుకుంటుపోతే జిల్లాలో అనేకమంది ఉన్నట్లు పరిశీలకులు చెబుతున్నారు.

ఉక్కు ప్రవీణ్‌కుమార్‌రెడ్డి కనుమరుగు

తెలుగుదేశం పార్టీకి దిక్కుమొక్కు లేనప్పుడు గండ్లూరు ప్రవీణ్‌కుమార్‌రెడ్డి ప్రొద్దుటూరులో విశేషంగా పనిచేశారు. ఆపై టీడీపీ ఇన్‌ఛార్జిగా ప్రకటించి ఒకదశలో టీడీపీ అభ్యర్థిగా ప్రచారం చేశారు. నారాలోకేష్ ఉక్కు ప్రవీణ్ నాయకత్వాన్ని బలపర్చాలని యువగళం కార్యక్రమంలో పిలుపును కూడా ఇచ్చారు. ఎన్నికలు ముగియగానే ఉక్కు ప్రవీణ్ ఆచూకీ కనుమరుగయ్యింది. పార్టీ నుంచి సస్పెన్షన్ చేయాలంటూ ప్రొద్దుటూరు, కమలాపురం ఎమ్మెల్యే నంద్యాల వరదరాజులరెడ్డి, పుత్తా కృష్ణచైతన్యరెడ్డి అధిష్టానాన్ని డిమాండ్ చేశారు. అక్కడే మాజీ ఎమ్మెల్యే లింగారెడ్డి ప్రమేయాన్ని ఏమాత్రం సహించడం లేదు. ఇలా ప్రతి నియోజకవర్గంలో సుదీర్ఘకాలం టీడీపీలో పనిచేసిన కార్యకర్తలు అనేక అవస్థలు పడుతున్నారన్నది సుస్పష్టంగా కన్పిస్తోంది.

చిత్తశుద్ధి లేకపోవడంతోనే పేలవంగా మహానాడు

కడపలో నిర్వహిస్తున్న మహానాడుకు రెండో రోజు పూర్తిగా ఆదరణ కరవయ్యింది. మొదటి రోజు అంతంత మాత్రంగా హాజరైన తెలుగు తమ్ముళ్లు, రెండు రోజు పూర్తిగా ముఖం చాటేశారు. మహానాడు ప్రాంగణం వైపే చూడని వారు కొందరైతే, వచ్చిన వారు కూడా ప్రసంగాలు ప్రారంభం కాగానే తిరుగుబాట పట్టారు. వెరసి మహానాడు ప్రాంగణం, చుట్టుపక్కల రహదారులన్నీ ఖాళీగా దర్శనమిచ్చాయి. ఎంతో ఆర్భాటంగా మహానాడును కడపలో నిర్వహించుకుంటున్నాం అని చెప్పుకున్న టీడీపీ బోర్లా పడింది. సొంత పార్టీ కార్యకర్తల నుంచే ఆదరణ కరవైంది. దీనికి ప్రధాన కారణం నేతల్లో చిత్తశుద్ధి లేకపోవడమేనని పలువురు చెప్పుకొస్తున్నారు. మహానాడులో రెండో రోజు ఉదయాన్నే ఖాళీ కుర్చీలు దర్శనమిచ్చాయి. ఇక ఆ టెంట్ల కింద ఉన్న జనాలు తప్ప కనుచూపు మేర ఎక్కడా జనం కనిపించలేదు. సొంత పార్టీ కార్యకర్తలే మహానాడుకు డుమ్మా కొట్టడం ఇప్పుడు తెలుగుదేశం పార్టీ నాయకులకు మింగుడు పడటం లేదని విశ్లేషకులు వెల్లడిస్తున్నారు.



ముఖ్యనేతలు ప్రసంగిస్తుండగా ఖాళీగా ఉన్న కుర్చీలు

మహానాడుతో రాష్ట్రానికి ఒరిగింది శూన్యం

మాజీ ఎమ్మెల్యే కొరముట్ల శ్రీనివాసులు



రైల్వేకోడూరు అర్బన్: కడపలో టీడీపీ, ముఖ్యమంత్రి చంద్రబాబు నిర్వహిస్తున్న మహానాడుతో రాష్ట్రానికి ఒరిగింది శూన్యమని వైఎస్సార్‌సీపీ రాష్ట్ర అధికార ప్రతినిధి, మాజీ ఎమ్మెల్యే కొరముట్ల శ్రీనివాసులు విమర్శించారు. కేవలం గతప్రభుత్వాన్ని విమర్శించడం, లోకేష్‌ను పొగుడుకోవడంతోనే రెండురోజులు సరిపెట్టారన్నారు.జనం లేక మహానాడు వెలవెలబోయిందని అన్నారు. బుధవారం స్థానిక పార్టీ కార్యాలయంలో ఆయన మాట్లాడుతూ అమలు చేయలేని హామీలతో ప్రజలను నమ్మించి ఓట్లు దండుకొని, పథకాలు ఎగ్గొట్టి పండుగ చేసుకుంటున్నారని తెలిపారు. ప్రజలకు చేసిన మోసాలకు చివరకు వరుణుడు కూడా ఆగ్రహించారని పేర్కొన్నారు. ఎన్నికలకు ముందు ప్రజలకు హామీ ఇచ్చిన సూపర్ సిక్స్ పథకాలు ఏమయ్యాయని ప్రశ్నించారు. అన్నిరంగాల్లో గత ప్రభుత్వం యువతకు అందించిన ఉద్యోగాలు పీకేసి, గత ప్రభుత్వం చేసిన అభివృద్ధి పనులు ప్రారంభించుకుంటూ ఏ ముఖం పెట్టుకొని మహానాడు నిర్వహిస్తున్నారని విమర్శించారు. జనాలు రాకపోవడంతో డ్వాక్రా సంఘాలు, గ్రామాల్లోని ప్రజలను మహానాడుకు రాకుంటే పథకాలు రావంటూ కొందరు అధికారులు బలవంతంగా మూడోరోజుకు తరలించే ప్రయత్నం చేస్తున్నారని చెప్పారు. మహిళలు, యువతులు మాయమవుతున్నా పవన్‌కళ్యాణ్ పట్టించుకోలేదని, ఒక్కమాట కూడా మాట్లాడలేదన్నారు. వైఎస్ జగన్ హయాంలో ప్రజలకు అన్ని పథకాలు అందించారని గుర్తు చేశారు. కరోనా కష్టకాలం ఉన్నప్పటికీ సంక్షేమ పథకాలకు కేటాయించిన నిధులు, ఇప్పుడు చంద్రబాబు కేటాయించిన నిధుల గురించి ప్రజలు గమనించాలన్నారు. రెడ్‌బుక్‌తోనే పరిపాలన చేయాలని తండ్రీకొడుకులు, పవన్‌కళ్యాణ్ చూస్తున్నారని తెలిపారు. జగనన్న పరిపాలన విలువ ఇప్పుడు ప్రజలకు తెలుస్తోందని పేర్కొన్నారు.

టమాట రైతు వెలవిల

- ఎండలు మండుతాయని, ధరలపై ఆశతో అత్యధికంగా పంట సాగు
- కిలో రూ.6 మించని ధర
- మదనపల్లె మార్కెట్‌కు రికార్డుస్థాయిలో 1,826 టన్నులు రాక
- పెట్టుబడి చేతికందక కన్నీరు పెడుతున్న రైతులు





పెద్దతిప్పసముద్రంలో పొలంలోనే వదిలేసిన టమాట పంట

మదనపల్లె: జిల్లాలో గతేడాది ఏప్రిల్, మే నెలల్లో టమాట ధరలు ఆకాశాన్నంటి రైతులు నాలుగు కాసులు కళ్లజూశారు. ఈ ఏడాది కూడా ఇవే ధరలు పలుకుతాయన్న ఆశతో తంబళ్లపల్లె, మదనపల్లె నియోజకవర్గాల రైతులు సాధారణ సాగుకు మించి రెండింతలు అధికంగా టమాట సాగు చేశారు. ధరలపై రైతులు ఒకటి తలిస్తే.. ప్రకృతి మరోలా తలచింది. ఫలితంగా ఆశలన్నీ తలకిందులై అన్నదాతల కొంప ముంచేసింది. నిట్ట నిలువునా నష్టపోవడంతో పెట్టిన పెట్టుబడి కూడా చేతికందే పరిస్థితి లేక కంటతడి పెట్టే దయనీయమైన పరిస్థితి నెలకొంది. ధరల పతనానికి ప్రకృతిలో వచ్చిన మార్పు ప్రధాన కారణమైంది. దీంతో రైతులకు పెట్టిన పెట్టుబడి కూడా దక్కని పరిస్థితి నెలకొంది.

ఎండలకు బదులు చల్లని వాతావరణం

ఫిబ్రవరి–మార్చిలో టమాట నారు నాటితే మే నెలలో దిగుబడులు అంది మంచి ధరలు పలుకుతాయని రైతాంగం అంచనా వేసింది. దీంతో తంబళ్లపల్లె నియోజకవర్గంలో ఐదు వేల ఎకరాలు, మదనపల్లె నియోజకవర్గంలో మూడు వేల ఎకరాల్లో టమాటా సాగు చేశారు. అయితే ఈమారు ఏప్రిల్‌లో కూడా ఎండలు అంతగా లేవు. సాధారణ వాతావరణమే నెలకొంది. ఏప్రిల్ నుంచి మొదలైన దిగుబడులకు ధరలు బాగా పలకాలి. దిగుబడులను మదనపల్లె, ములకలచెరువు, బి.కొత్తకోట, గుర్రంకొండ, అంగళ్లు మార్కెట్‌లకు తరలిస్తే ధరల మాటేలేదు. దీని కారణంగా ఎండలు అంతగాలేకపోవడం, చల్లటిగాలి, వర్షాలు కురవవని అనుకుంటే ఊహించని విధంగా ఏప్రిల్ మూడో వారం నుంచే వర్షాలు మొదలవడంతో టమాట పంట దిగుబడులు ఆశించిన దానికంటే అత్యధికంగా వచ్చాయి. ఎండలు ఉంటే దిగుబడులు తగ్గుతాయి. దీంతో ధరలు పలుకుతాయి. ఈ సీజన్‌లో కథ అడ్డం తిరిగింది. వాతావరణ మార్పు టమాట దిగుబడులపై తీవ్ర ప్రభావం చూపింది. ఊహించనిస్థాయిలో దిగుబడులు వస్తున్నాయి. అధికారిక లెక్క ప్రకారం తంబళ్లపల్లెలో 4,069 ఎకరాల్లో సాగైనట్టు ఉండగా అంతకు మించి ఐదు వేల ఎకరాల దాకా ఉంది. మదనపల్లెలో 2,925 ఎకరాల్లో సాగవుతున్నట్టు అధికారిక లెక్క. ఈ స్థాయిలో టమాట సాగు రాష్ట్రంలో ఎక్కడా లేదు. జిల్లాలో 9,898 ఎకరాల్లో సాగు ఉన్నట్టు అధికారిక లెక్క అయితే 12వేల దాక సాగు ఉంది.

రూ.6 దాటని ధర

మదనపల్లె, బి.కొత్తకోట, అంగళ్లు, మొలకలచెరువు మార్కెట్‌లకు వస్తున్న టమాట పంటకు కిలో ధర రూ.6కు మించడం లేదు. ఒకవేళ మించితే అది మొదటి గ్రేడ్. మొత్తం దిగుబడి మొదటి గ్రేడు ఉండదు. దీంతో ధర విషయంలో రైతులకు ఆశించినట్టు దక్కలేదు. అత్యధిక ధర రూ.9 నుంచి రూ.10 వరకు పలికింది. ఒక్కో సారి రూ.16 పలికింది. ఇది మొదటి గ్రేడ్‌కు పలికిన ధర. మిగతా గ్రేడ్‌లకు ధర ఆశించిన మేరకు లేదు. రైతులు ఒక్కో ఎకరా సాగుకు రూ.2 నుంచి రూ.2.15 లక్షల వరకు ఖర్చు చేశారు. ఈ ధరలతో పెట్టుబడి కూడా దక్కే పరిస్థితులు కనిపించడం లేదు.

ఒక్కరోజే 1,826 టన్నులు

మదనపల్లె మార్కెట్‌కు బుధవారం ఒక్కరోజే 1,826 టన్నుల టమాట విక్రయానికి వచ్చింది. ములకలచెరువు, అంగళ్లు, బి.కొత్తకోట, గుర్రంకొండ మార్కెట్లకు వచ్చిన టమాట అదనం. మదనపల్లె మార్కెట్‌కు మార్చిలో 2,982 టన్నుల టమాట విక్రయానికి వస్తే, ఏప్రిల్‌లో 7,814 టన్నులు, మేలో బుధవారం నాటికి 23,800 టన్నుల టమాట వచ్చింది. జిల్లాలో దిగుబడి అంచనాలో అత్యధిక టమాట మదనపల్లె మార్కెట్‌కే వస్తోంది. జూన్, జూలై నెలల్లో ఈ దిగుబడి ఇంతకు రెట్టింపు అయ్యే అవకాశం లేకపోలేదు. జూన్ లో 81,852 టన్నులు, జూలైలో 74,405 టన్నులు విక్రయానికి రావొచ్చని అంచనా. కాగా ఈ ప్రాంతాల దిగుబడులు ఇక్కడే కాకుండా కర్ణాటకలోని కోలారు, చింతామణి, శ్రీనివాసపురం మార్కెట్లకు కూడా తరలించి విక్రయించుకుంటున్నారు.

సాగులో ఉన్న టమాట

మండలం	ఎకరాలు	మండలం	ఎకరాలు	మండలం	ఎకరాలు
మదనపల్లె	1,094	పెద్దతిప్పసముద్రం	686	టి.సుండుపల్లె	34
నిమ్మనపల్లె	502	బి.కొత్తకోట	752	కలకడ	395
రామసముద్రం	1,329	కురబలకోట	602	కలికిరి	165
వాయల్పాడు	372	తంబళ్లపల్లె	629	పీలేరు	70
గుర్రంకొండ	800	పెద్దమండ్యం	624	కేవిపల్లె	55
ములకలచెరువు	776	సంబేపల్లె	462	లక్కిరెడ్డిపల్లె	34
		చిన్నమండెం	360	రాయచోటి	39
		వీరబల్లి	40	గాలివీడు	61

రూ.16 లక్షల పెట్టుబడి



8 ఎకరాల్లో టమాట పంట సాగు చేశాను. ఎకరాకు రూ.2 లక్షల పెట్టుబడి ఖర్చు వచ్చింది. మొత్తం రూ.16 లక్షలకుపైగా పెట్టుబడి పెట్టి బిడ్డలా చూసుకొంటూ సాగు చేశాను. అయితే ధరలు పతనమయ్యాయి.పంటను తీసి మార్కెట్‌కు తరలిస్తే కూలీ, రవాణా ఖర్చులకు కూడా గిట్టుబాటు కాదు. దీంతో పంట తీసి మళ్లీ నష్టపోవడం కంటే తీయకపోవడమే మేలని పొలంలోనే వదిలేశా. –బోర్‌వెల్ నారాయణరెడ్డి, టమాట రైతు, అంకిరెడ్డిపల్లె, పీటీఎం మండలం

రూ.9 లక్షలు నష్టం



ధరలపై ఆశలు పెట్టుకుని ఏడెకరాల్లో టమాట సాగు చేశా. రూ.12 లక్షల పెట్టా. టమాట విక్రయంతో చేతికందింది రూ.3 లక్షలు.మిగిలిన పెట్టుబడి రూ.9 లక్షలు నష్టపోయాను. ధరలు పలకుతాయని ఆశిస్తే పరిస్థితులు తారుమారయ్యాయి.

–నరసింహారెడ్డి, టమాట రైతు, గౌడసానిపల్లె, తంబళ్లపల్లె మండలం

రైతు ఆత్మహత్యాయత్నం

మదనపల్లె రూరల్: లక్షలు ఖర్చుచేసి సాగుచేసిన టమాటా పంట నష్టాలు మిగల్చడంతో మనస్తాపానికి గురైౖ రైతు ఆత్మహత్యకు యత్నించిన ఘటన మండలంలో జరిగింది. కోటవారిపల్లె పంచాయతీ బండకిందపల్లెకు చెందిన వెంకటరమణ కుమారుడు ఈశ్వర(49) ఐదెకరాల్లో దాదాపు రూ.20లక్షలు ఖర్చుచేసి టమాటా సాగుచేశాడు. తీరా పంట చేతికొచ్చేసరికి ధరలు లేకపోవడంతో నష్టపోయాడు. దీంతో మనస్తాపానికి గురై పురుగుమందు తాగాడు. గమనించిన కుటుంబసభ్యులు జిల్లా ఆస్పత్రికి తరలించారు. పరిస్థితి విషమించడంతో ప్రైవేట్ ఆస్పత్రికి తీసుకెళ్లారు. తాలూకా పోలీసులు కేసు విచారణ చేస్తున్నారు.



ఆత్మహత్యకుయత్నించిన ఈశ్వర

యోగాతో సంపూర్ణ ఆరోగ్యం



యోగాంధ్రలో ఆసనాలు వేస్తున్న హాజరైన వారు



యోగాసనాలు వేస్తున్న కలెక్టర్, జేసీ, సబ్‌కలెక్టర్

కలెక్టర్ శ్రీధర్ చామకూరి

మదనపల్లె: యోగాతో సంపూర్ణ ఆరోగ్యం, మానసిక ప్రశాంతత సిద్ధిస్తుందని కలెక్టర్ శ్రీధర్ చామకూరి అన్నారు. బుధవారం ఉదయం స్థానిక బెంగళూరు రోడ్డులోని బీటీ కళాశాల మైదానంలో యోగా కార్యక్రమం నిర్వహించారు. జిల్లా అధికారులతోపాటు వివిధ ప్రాంతాల నుంచి హాజరైన మండల, గ్రామస్థాయి అధికారులు, ఆరోగ్యశాఖ సిబ్బంది, సచివాలయ ఉద్యోగులు, అంగన్‌వాడీ కార్యకర్తలు, విద్యార్థులు, పలుశాఖల ఉద్యోగులతో యోగాసనాలను వేశారు. కలెక్టర్ శ్రీధర్, ఎమ్మెల్యే షాజహాన్‌బాషా, జేసీ ఆదర్శ్ రాజేంద్ర, సబ్‌కలెక్టర్ వై.మేఘస్వరూప్ యోగాసనాలు వేశారు. ఈ సందర్భంగా హాజరైన వారిని ఉద్దేశించి కలెక్టర్ మాట్లాడుతూ భారతీయ సంస్కృతిలో యోగాకు ప్రాముఖ్యత ఉందన్నారు. మానసిక, శారీరక, అధ్యాత్మిక ఉన్నతికి ఉపయోగం కలుగుతుందన్నారు. ఆనందకరమైన జీవితానికి యోగాఅవసరమని అన్నారు. వయసుతో నిమిత్తం లేకుండా పిల్లల నుంచి పెద్దల వరకు యోగాను ఆచరించవచ్చన్నారు. మే 21 నుంచి జూన్ 21 వరకు యోగా మాసోత్సవాలను జరుపుతున్నట్టు చెప్పారు. యోగా గురువు పాల్ బ్రహ్మకుమార్ 15 మంది ఉప గురువులతో కలిసి 45 నిమిషాల పాటు హాజరైన వారితో యోగాసనాలు వేయించారు. కార్యక్రమానికి ముందు విద్యార్థులు నిర్వహించిన సాంస్కృతిక కార్యక్రమాలు ఆకట్టుకున్నాయి. తర్వాత మైదానం నుంచి చిప్పిలి వరకు హాజరైన వారితో ర్యాలీ నిర్వహించారు. కార్యక్రమంలో రాయచోటి ఆర్డీఓ సుబ్బరాజు, డీఎఫ్ఓ జగన్నాథ్‌సింగ్, మదనపల్లె కమీషనర్ ప్రమీల, హార్టికల్చర్, హౌసింగ్ జిల్లా అధికారులు రవిచంద్రారెడ్డి, సాంబశివయ్య పాల్గొన్నారు.

మహానాడుకు సుగవాసి కుటుంబం దూరం

సుగవాసి భవన్‌లో ఎన్టీఆర్ జయంతి వేడుకలు

రాయచోటి: టీడీపీ ఆవిర్భావం నుంచి ఆ పార్టీతో అడుగులు వేసిన సుగవాసి కుటుంబం, ఆయన అనుచరులు నేడు కడప గడ్డపై జరుగుతున్న మహానాడు వేదికకు దూరమయ్యారు. ఒక్క మాటలో చెప్పాలంటే పార్టీ అధిష్టానమే సుగవాసి కుటుంబాన్ని దూరం చేసుకుందన్న వ్యాఖ్యలు వినిపిస్తున్నాయి. బుధవారం దివంగత నేత ఎన్టీ రామారావు జయంతిని రాయచోటిలోని సుగవాసి పార్టీ కార్యాలయంలో నిర్వహించారు. మహానాడులో సుగవాసి కుటుంబాన్ని పట్టించుకోలేదన్న ఆవేశం, ఆక్రోశం ఆయన వర్గీయుల్లో కట్టలు తెంచుకుంటుంది. సుగవాసి పాలకొండ్రాయుడు తనయులకు ప్రాధాన్యం లేకపోవడంతో బాల సుబ్రమణ్యం, ప్రసాద్ బాబులు మహానాడుకు దూరమయ్యారని తెలిసింది. వారి అనుయాయులు కూడా మహానాడు కార్యక్రమానికి వెళ్లలేదని సమాచారం. రాష్ట్ర టీడీపీ కార్యనిర్వహక కార్యదర్శి, టీడీపీ పాలకమండలి మాజీ సభ్యులు సుగవాసి ప్రసాద్ బాబు తన అనుయాయులతో ఎన్టీఆర్ చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులు అర్పించారు. ఈ కార్యక్రమంలో నియోజకవర్గంలోని సుగవాసి అనుచరులు పెద్దఎత్తున హాజరై సంఘీభావం తెలిపారు.



ఎన్టీఆర్ చిత్రపటానికి నివాళులు అర్పిస్తున్న సుగవాసి ప్రసాద్‌బాబు తదితరులు

తండ్రి ఆశయ సాధనకోసం..

తండ్రి ఆశయాలకు అనుగుణంగా నడుచుకుంటానని సుగవాసి ప్రసాద్ బాబు అన్నారు. రాబోయే రోజుల్లో అందరి అభిప్రాయం మేరకు రాజకీయాలలో అడుగులు వేస్తామన్నారు. ఎన్నికష్టాలు వచ్చినా పార్టీని, కుటుంబాన్ని నమ్ముకున్న నాయకులు, కార్యకర్తలకు అండగా ఉంటామని తెలిపారు.

చిట్టీ డబ్బులు అడిగితే కుటుంబంపై దాడి

- కంతులు పూర్తయి ఏడాది కావస్తున్నా డబ్బులు చెల్లించని కపిలేశ్వర్ చిట్స్
- యాజమాన్యాన్ని నిలదీస్తే.. అనుచరులు, సిబ్బందితో కలిసి హత్యాయత్నం
- టూటౌన్ పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు.. మూడు వాహనాలు స్వాధీనం


కపిలేశ్వర్ చిట్స్ కార్యాలయం వద్ద రోడ్డుపై ధర్నా చేస్తున్న బాధితులు

మదనపల్లె రూరల్ : ఆపద సమయంలో ఆదుకుంటుందని, కష్టార్జితాన్ని కపిలేశ్వర్ చిట్‌ఫండ్స్ సంస్థలో చిట్టీల రూపంలో జమచేస్తే...కంతులు పూర్తయినా డబ్బులు ఇవ్వకపోగా, అడిగినందుకు అనుచరులు, సిబ్బందితో బాధిత కుటుంబంపై యాజమాన్యం దాడికి పాల్పడిన ఘటన బుధవారం మదనపల్లెలో జరిగింది. ప్రొద్దుటూరు నుంచి మూడు వాహనాల్లో మదనపల్లెకు వచ్చిన కపిలేశ్వర్ చిట్స్ ఎండీ సీకే నాయుడు అనుచరులు, చిట్టీ డబ్బులు చెల్లించిన కస్టమర్ రామ్మోహన్‌రెడ్డి, అతని భార్య రత్నకుమారి, కుమార్తె రమ్యశ్రీపై దాడికి పాల్పడి విచక్షణారహితంగా కొట్టడమే కాకుండా మెట్లపై నుంచి కిందకు తోసేశారు. దీంతో బాధితుడు, ప్రజా సంఘాల మద్దతుతో కపిలేశ్వర్ చిట్స్ కార్యాలయం ఎదుట ధర్నాకు దిగడంతో ఉద్రిక్త వాతావరణం ఏర్పడింది. విషయం తెలుసుకున్న టూటౌన్ పోలీసులు ఘటనాస్థలానికి చేరుకుని దాడిపై బాధితుల నుంచి వివరాలు సేకరించారు. దాడికి పాల్పడిన వ్యక్తులను విచారించి, వారు వచ్చిన మూడు వాహనాలను స్వాధీనం చేసుకుని స్టేషన్‌కు తరలించారు. ఘటనపై బాధితులు తెలిపిన వివరాలు..

పట్టణంలోని ఎస్టేట్ శివాజీనగర్, పద్మావతి కల్యాణమండపం సమీపంలో నివాసం ఉంటున్న బి.రామ్మోహన్‌రెడ్డి ఆర్టీసీ–2డిపోలో డ్రైవర్‌గా పనిచేస్తున్నాడు. అతనికి భార్య రత్నకుమారి, ముగ్గురు కుమార్తెలు ఉన్నారు. కుటుంబ భవిష్యత్ అవసరాల కోసం సీటీఎంరోడ్డులోని కపిలేశ్వర్ చిట్స్‌లో రామ్మోహన్‌రెడ్డి పేరుపై రూ.5 లక్షలు, భార్య రత్నకుమారి పేరుపై రూ.5లక్షలు చిట్టీలు వేశారు. 50 కంతులు పూర్తిగా చెల్లించాడు. ఆగస్టు–2024కు చిట్టీ కంతులు పూర్తికాగా, యాజమాన్యం చిట్టీ నగదు చెల్లించాల్సి ఉంది. అయితే గడువు పూర్తయి పదినెలలు కావస్తున్నా.. కేవలం రూ.1లక్ష 20వేలు మాత్రమే బాధితులకు చెల్లించారు. మిగిలిన నగదు చెల్లించకుండా వారిని వేధిస్తూ వచ్చారు. ఈ క్రమంలో పలుమార్లు కార్యాలయం చుట్టూ బాధితులు తిరిగినా ఫలితం లేకపోవడంతో విసిగిపోయారు. ఈ ఏడాది ఫిబ్రవరిలో నగదు చెల్లించాలని బాధితుడు గట్టిగా నిలదీయడంతో ఏప్రిల్ 18కి పూర్తిగా చెల్లిస్తామని యాజమాన్యం చెప్పింది. అయినా అప్పటికీ చెల్లించకపోవడంతో విసిగిపోయిన బాధితులు బుధవారం చిట్ కార్యాలయానికి చేరుకుని సిబ్బందిని నిలదీశారు. కార్యాలయానికి తాళాలు వేసి నిరసన తెలిపేందుకు ప్రయత్నించారు. యాజమాన్య వైఖరిపై టూటౌన్ పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేసేందుకు వెళ్లగా, నగదు లావాదేవీలు కోర్టులో తేల్చుకోవాలని పోలీసులు చెప్పి పంపేశారు. ఇంటికి చేరుకున్న రామ్మోహన్‌రెడ్డికి మధ్యాహ్నం 3 గంటల సమయంలో కపిలేశ్వర్ చిట్స్ మేనేజర్ నరసింహులు ఫోన్‌చేసి, ఎండీ సీకే నాయుడు వచ్చారని, మీ నగదు చెల్లిస్తారు. కార్యాలయానికి రావాలంటూ కోరాడు. దీంతో రామ్మోహన్‌రెడ్డి, భార్య రత్నకుమారి, కుమార్తె రమ్యశ్రీతో కలిసి చిట్స్ కార్యాలయానికి 3.30 గంటలకు చేరుకున్నాడు. అప్పటికే ప్రొద్దుటూరు నుంచి మూడు వాహనాల్లో వచ్చిన ఎండీ సీకే నాయుడు, అనుచరులతో కలిసి కార్యాలయంలో ఉన్నారు. బాధితులు కార్యాలయానికి వచ్చిన వెంటనే అనుచరులు, కార్యాలయ సిబ్బంది ఎండీ సీకే నాయుడు సమక్షంలో ఒక్కసారిగా మూకుమ్మడిగా రామ్మోహన్‌రెడ్డి, కుటుంబ సభ్యులపై దాడిచేసి విచక్షణారహితంగా కొట్టారు. దాడిలో రామ్మోహన్‌రెడ్డి పళ్లు విరగడంతో


కపిలేశ్వర్ చిట్స్ కార్యాలయం


దాడిలో పళ్లు విరిగిపోయాయని చూపుతున్న రామ్మోహన్‌రెడ్డి, కుటుంబ సభ్యులు

పాటు రక్తగాయాలై తీవ్రంగా గాయపడ్డాడు. మహిళలు అని చూడకుండా రత్నకుమారి, రమ్యశ్రీలను అసభ్యపదజాలంతో దూషిస్తూ కొట్టడంతో పాటు దిక్కున్నచోటు చెప్పుకోమంటూ మెట్లపై నుంచి కిందకు తోసేశారు. దీంతో బాధితుడు నడిరోడ్డుపై తనకు జరిగిన అన్యాయంపై ఆవేదన వ్యక్తం చేస్తూ బంధుమిత్రులతో కలిసి నిరసన తెలిపాడు. బాధితుడికి అండగా బహుజనసేన రాష్ట్ర అధ్యక్షుడు శ్రీచందు మద్దతు తెలిపి చిట్స్ యాజమాన్యానికి వ్యతిరేకంగా నినాదాలు చేశారు. దీంతో పోలీసులు అక్కడకు చేరుకుని బాధితులతో మాట్లాడారు. దాడి ఘటనపై ఫిర్యాదు తీసుకున్నారు. దాడికి పాల్పడిన వ్యక్తులు, వచ్చిన మూడు వాహనాలను స్వాధీనం చేసుకుని, స్టేషన్‌కు తరలించారు. ఘటనపై విచారణ చేస్తున్నట్లు పోలీసులు తెలిపారు.

క్లుప్తంగా

మాజీ సీఎం ఎన్టీఆర్‌కు నివాళి


ఎన్టీఆర్ చిత్రపటానికి నివాళులు అర్పిస్తున్న రాయచోటి డీఎస్పీ ఎంఆర్ కృష్ణమోహన్

రాయచోటి : మాజీ ముఖ్యమంత్రి దివంగత ఎన్టీ రామారావుకు అన్నమయ్య జిల్లా పోలీసులు ఘనంగా నివాళులు అర్పించారు. ఎస్పీ వి.విద్యాసాగర్ నాయుడు ఆదేశాల మేరకు జిల్లా పోలీసు ప్రధాన కార్యాలయంలో బుధవారం నందమూరి తారక రామారావు జయంతి సందర్భంగా ఆయన చిత్రటానికి రాయచోటి డీఎస్పీ ఎంఆర్ కృష్ణమోహన్ పూలమాల వేసి నివాళులు అర్పించారు. ఈ సందర్భంగా ఆయన సేవలను కొనియాడారు. ఈ కార్యక్రమంలో రిజర్వ్ ఇన్‌స్పెక్టర్ ఎం.పెద్దయ్య, ఎస్ఐలు, ఆర్ఎస్‌లు, జిల్లా పోలీసు కార్యాలయ సిబ్బంది, పోలీసు సిబ్బంది, మహిళా పోలీసులు, హోంగార్డులు పాల్గొన్నారు.

కలెక్టరేట్‌లో..



ఎన్‌టీఆర్ జయంతి సభలో మాట్లాడుతున్న డీఆర్‌ఓ

అన్నమయ్య జిల్లా కలెక్టర్ కార్యాలయంలో దివంగత మాజీ సీఎం ఎన్‌టీఆర్ 102వ జయంతి వేడుకలను నిర్వహించారు. బుధవారం కలెక్టరేట్‌లోని ప్రజా భవనంలో కలెక్టర్ ఆదేశాల మేరకు డీఆర్‌ఓ మధుసూదనరావు ఆధ్వర్యంలో ఎన్‌టీఆర్ చిత్రపటానికి నివాళులర్పించారు. కార్యక్రమంలో రాయచోటి ఆర్డీఓ శ్రీనివాస్, జిల్లా విద్యాశాఖ అధికారి శివప్రకాష్ రెడ్డిలు మాట్లాడారు. రాయచోటి తహసీల్దార్ నరసింహకుమార్, ల్యాండ్ సెక్షన్ సూపరింటెండెంట్ క్రాంతికుమార్, కోఆర్డినేషన్ సెక్షన్ సూపరింటెండెంట్ రెడ్డప్పరెడ్డి, కలెక్టరేట్ సిబ్బంది, విద్యార్థులు పాల్గొన్నారు.

భారతి సిమెంట్స్‌ను వినియోగించండి


డీలర్‌కు ప్రోత్సాహక బహుమతి అందజేస్తున్న భారతి సిమెంటు ప్రతినిధులు

గాలివీడు : గ్రామీణ ప్రాంతాలలో గృహాలు, కట్టడాలకు భారతి సిమెంటు వాడుతూ నాణ్యత పెంచుకోవాలని భారతి సిమెంట్స్ ప్రతినిధులు సూచించారు. బుధవారం వారు స్థానిక డీలర్ ఆధ్వర్యంలో గృహ నిర్మాణదారులు, బేల్దార్లు, బిల్డర్లతో సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ ఓపీసీ 53 గ్రేడ్‌తో నాణ్యమైన సిమెంటును సరఫరా చేస్తున్నామన్నారు. ప్రతి ఒక్కరూ భారతి సిమెంటును వాడి నాణ్యత మేరకు తమ కట్టడాలను శాశ్వతం చేసుకోవాలన్నారు. కార్యక్రమంలో భారతి సిమెంట్స్ యాజమాన్యం, పలువురు బేల్దార్లు, గృహాల యజమానులు పాల్గొన్నారు.

నేడు మాతంగా మహాపీఠ ఆవిర్భావ కార్యక్రమం

లక్కిరెడ్డిపల్లి : మండలంలోని లక్కిరెడ్డిపల్లి–వేంపల్లి మార్గ మధ్యంలోని దొరువుచెరువు వద్ద నూతనంగా ఏర్పాటు కానున్న మాతంగా మహాపీఠ ఆవిర్భావ కార్యక్రమం నిర్వహించనున్నారు. అన్నమయ్య జిల్లా ఎంపీపీల సంఘం అధ్యక్షుడు మద్దిరేవుల సుదర్శన్ రెడ్డి, స్థానిక సర్పంచ్ కాలాడి జనార్దన్ రెడ్డితో కలిసి బుధవారం అన్నమయ్య ఆర్డీఓ శ్రీనివాసులు, డీఎస్పీ కృష్ణమోహన్‌లు ఏర్పాట్లను పరిశీలించారు. ఈ కార్యక్రమానికి రాష్ట్ర వైద్య, ఆరోగ్యశాఖామంత్రి సత్యకుమార్, తెలంగాణ వైద్య ఆరోగ్యశాఖ మంత్రి దామోదర రాజనరసింహ, కేంద్ర మంత్రులు మురుగన్, కేంద్ర మాజీ మంత్రి మునియప్ప, ఏపీ రాష్ట్ర మాజీ మంత్రి డొక్కా మాణిక్య వరప్రసాద్‌తోపాటు పలు రాష్ట్రాలకు చెందిన మాజీ మంత్రులు, ఎమ్మెల్యేలు, మాజీ ఎమ్మెల్యేలు హాజరు కానున్నట్లు మాతంగ మహాపీఠాధిపతి ధర్మాధికారి, అన్నమయ్య జిల్లా బీజేపీ మాజీ అధ్యక్షుడు ఏవీ సుబ్బారెడ్డి తెలిపారు.

క్రికెట్ ఎంపికలు

కడప ఎడ్యుకేషన్ : కడపలోని వైఎస్సార్ ఏసీఏ స్టేడియంలో ఈనెల 31, జూన్ 1 తేదీల్లో క్రికెట్ ఎంపికలు నిర్వహించనున్నట్లు వైఎస్సార్ జిల్లా క్రికెట్ అసోసియేషన్ ప్రెసిడెంట్ అవ్వారు రెడ్డి ప్రసాద్ తెలిపారు. అండర్ 19 పురుషులు, అండర్ 19, అండర్ 15 మహిళలకు ఎంపికలు ఉంటాయన్నారు. ఆసక్తి గల క్రీడాకారులు తమ ఆధార్ కార్డు, బర్త్ సర్టిఫికెట్(ఫారం 5), పాస్‌పోర్ట్ సైజ్ ఫొటో, క్రికెట్ కిట్ బ్యాగులు తీసుకుని రావాలన్నారు. ఈ ఎంపికలు ఈ రెండు తేదీల్లో ఉదయం 7:30 గంటలకు నిర్వహిస్తామన్నారు.

మహానాడులో మదనపల్లె జిల్లా ప్రకటించాలి



మదనపల్లె జిల్లా ప్రకటించాలని డిమాండ్ చేస్తున్న పీటీయం శివప్రసాద్

మదనపల్లె రూరల్ : కడపలో జరుగుతున్న మహానాడులో మదనపల్లె జిల్లాను ప్రకటించి, ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు, మంత్రి లోకేష్ ప్రజలకు ఇచ్చిన ఎన్నికల హామీని నిలబెట్టుకోవాలని జిల్లా సాధన సమితి కన్వీనర్ పీటీయం.శివప్రసాద్ డిమాండ్ చేశారు. మహానాడులో మదనపల్లె జిల్లా ప్రకటనకు డిమాండ్ చేస్తూ స్థానిక ప్రెస్‌క్లబ్‌లో బుధవారం మదనపల్లె జిల్లా సాధన సమితి మీడియా సమావేశం ఏర్పాటు చేసింది. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. రెండేళ్లక్రితం మహానాడు సందర్భంగా మదనపల్లెలో నిర్వహించిన మినీ మహానాడులో, టీడీపీ జాతీయ అధ్యక్షుడి హోదాలో ఎన్నికల సందర్భంగా గత ఏడాది మదనపల్లె బెంగళూరు బస్టాండ్‌లో నిర్వహించిన ఎన్నికల బహిరంగ సభలో మదనపల్లె జిల్లా ఏర్పాటు తన బాధ్యతగా పేర్కొన్నారన్నారు. అలాగే యువగళం పాదయాత్ర సందర్భంగా టీడీపీ జాతీయ ప్రధాన కార్యదర్శి హోదాలో నారా లోకేష్ రొంపిచెర్ల, మదనపల్లె సభల్లో మాట్లాడుతూ..తాము అధికారం చేపట్టిన మొదటి ఆరు నెలల్లో మదనపల్లె, పుంగనూరు, పీలేరు, తంబళ్లపల్లె నియోజకవర్గాలను కలిపి మదనపల్లె జిల్లా ఏర్పాటుచేస్తామని ప్రకటించారన్నారు. అయితే టీడీపీ అధికారంలోకి వచ్చి ఏడాది కావస్తున్నా...ఇప్పటికీ మదనపల్లె జిల్లా ఏర్పాటు ప్రక్రియ ప్రారంభించలేదని విమర్శించారు. సమావేశంలో మదనపల్లె జిల్లా సాధన సమితి నాయకులు ముత్యాల మోహన్, టి.ఏ.పీర్‌బాషా, కోనేటి దివాకర్‌రావు, బురుజురెడ్డి ప్రసాద్, గంగాధర్, రవిశంకర్, బి.నరసింహులు, కిరణ్ తదితరులు పాల్గొన్నారు.

రోడ్డు ప్రమాదంలో ఇద్దరికి తీవ్ర గాయాలు


కల్వర్టును ఢీకొన్న ప్రమాదంలో నుజ్జయిన కారు


కారుపై పడి ఉన్న విద్యుత్ స్తంభం

సిద్దవటం : మండలంలోని సాబ్‌బావి రహదారి సమీపంలో బుధవారం జరిగిన రోడ్డు ప్రమాదంలో ఉదయగిరికి చెందిన ఇద్దరు వ్యక్తులకు తీవ్ర గాయాలయ్యాయి. వివరాలిలా.. నెల్లూరు జిల్లా ఉదయగిరికి చెందిన వెనుకబడిన ప్రాంతాల అభివృద్ధి వేదిక రాష్ట్ర ప్రధాన కార్యదర్శి మాదాల వెంకట శ్యాంప్రసాద్ తన సొంత కారులో రాష్ట్ర నాయకుడు పట్టెడ రమణను ఎక్కించుకొని కడప ప్రెస్‌క్లబ్‌లో సమావేశానికి బయలుదేరారు. మండలంలోని సాబ్‌బావి రహదారి సమీపంలోకి రాగానే కల్వర్ట్‌ను ఢీకొని కారు మూడు పల్టీలు కొట్టింది. కారులో ప్రయాణిస్తున్న ఇద్దరికి తీవ్ర గాయాలు కావడంతో వారిని దార వెంట ప్రయాణికులు 108 వాహనంలో కడప రిమ్స్‌కు తరలించారు. సమాచారం తెలుసుకున్న సిద్దవటం పోలీసులు సంఘటన స్థలానికి చేరుకొని ప్రమాదం జరిగిన తీరును పరిశీలించారు.

విద్యుత్ స్తంభాన్ని ఢీ కొన్న కారు

రైల్వేకోడూరు అర్బన్ : రైల్వేకోడూరు మండలం మైసూరువారిపల్లి పంచాయతీ శాంతినగర్‌లోని కడప–తిరుపతి ప్రధాన రహదారిపై బుధవారం విద్యుత్ స్తంభాన్ని కారు ఢీ కొంది. తెలంగాణ రాష్ట్రం మహబూబ్‌నగర్‌కు చెందిన వారు కారులో వెళ్తుండగా ఈ ప్రమాదం జరిగింది. విద్యుత్ స్తంభం కుప్పకూలడంతో విద్యుత్‌కు తీవ్ర అంతరాయం ఏర్పడింది. కారులో ప్రయాణిస్తున్న వారు సురక్షితంగా ఉన్నారు.

మహిళపై దాడి

పులివెందుల రూరల్ : పట్టణంలోని సరస్వతి విద్యా మందిరం సమీపంలో నివాసముంటున్న కాంతమ్మ అనే మహిళపై నగరిగుట్టకు చెందిన బాషా, ఆయన భార్య ఇమాంబి షరీఫ్, కుమార్తెలు దాడి చేశారు. కాంతమ్మ అనే మహిళ బాషా దగ్గర డబ్బులు అప్పు తీసుకుంది. ఆ డబ్బులు ఇవ్వకపోవడంతో బాషాతోపాటు ఆమె భార్య ఇమాంబి కుటుంబ సభ్యులు బుధవారం సాయంత్రం ఇంటి దగ్గరకు వెళ్లి తీవ్రంగా గాయపరిచారు. దీంతో ఆమెను పులివెందుల ప్రభుత్వాసుపత్రికి తరలించారు. బాధితురాలి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు పోలీసులు తెలిపారు.

ప్రమాదవశాత్తు ఇసుక ట్రాక్టర్ బోల్తా


బోల్తాపడిన ఇసుక ట్రాక్టర్

వేంపల్లె : స్థానిక కడప – పులివెందుల రోడ్డులోని స్వామి వివేకానంద హైస్కూల్ సమీపంలో ప్రమాదవశాత్తు ఇసుక ట్రాక్టర్ బోల్తా పడింది. ఈ ఘటన బుధవారం మధ్యాహ్నం జరిగింది. వేంపల్లె నుంచి ఇసుకను పులివెందులకు తీసుకెళ్తుండగా ట్రాక్టరు మధ్య టైరు వీలు విరిగిపోవడంతో ఈ ప్రమాదం జరిగింది. ఇసుక ట్రాక్టర్ బోల్తా పడడంతో డ్రైవర్ రాజాకు స్వల్ప గాయాలయ్యాయి. ట్రాక్టర్ వీలు విరగడంతో సుమారు 20 మీటర్ల వరకు ఈడ్చుకుంటూ వెళ్లి బోల్తా పడింది. దీంతో ట్రాలీలో ఉన్న ఇసుకంతా రోడ్డుపై పడింది. అయితే వెనుక వైపు ఎలాంటి వాహనాలు రాకపోవడంతో పెద్ద ప్రమాదం తప్పింది.

ఉపాధ్యాయ బదిలీలలో తప్పిదాలను సవరించాలి

కడప ఎడ్యుకేషన్ : రాష్ట్ర ప్రభుత్వం నిర్వహిస్తున్న ఉపాధ్యాయ బదిలీలు ఒక ప్రహసనం లాగా మారాయని, బదిలీలలో తప్పిదాలను సవరించి సజావుగా జరిగేలా చర్యలు తీసుకోవాలని యూటీఎఫ్ రాష్ట్ర కార్యదర్శి లక్ష్మి రాజా, జిల్లా ప్రధాన కార్యదర్శి పాలెం మహేష్ బాబు పేర్కొన్నారు. బుధవారం ఈ విషయమై డీఈఓ షేక్ షంషుద్దీన్‌ను కలిసి వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ సర్వీస్ పాయింట్ల కేటాయింపులోను, పాత, కొత్త స్టేషన్ల పాయింట్లు నమోదు చేసుకోవడంలో ఒక్కొక్కరికి ఒక్కొక్క విధంగా పాయింట్లు కేటాయింపు జరుగుతున్నాయన్నారు.

పాముకాటుతో ఇద్దరికి అస్వస్థత


అస్వస్థతకు గురైన బాలుడు అరుణ్‌తేజ్

మదనపల్లె రూరల్ : పాముకాటుతో ఇద్దరు అస్వస్థతకు గురై స్థానిక ప్రభుత్వ జిల్లా ఆస్పత్రిలో చికిత్స పొందుతున్నారు. మండలంలోని సీటీఎం పంచాయతీ మిట్టపల్లెకు చెందిన చంద్రమ్మ(50) పొలం పనులు చేసుకుంటుండగా, పాముకాటుకు గురైంది. తీవ్ర అస్వస్థతకు గురికాగా, కుటుంబ సభ్యులు జిల్లా ఆస్పత్రికి తరలించారు. అదేవిధంగా పీటీఎం మండలం బురుజుపల్లెకు చెందిన రామకృష్ణ, జ్యోతి దంపతుల కుమారుడు పి.అరుణ్‌తేజ్(8) ఇంట్లో నిద్రిస్తుండగా, బుధవారం తెల్లవారుజామున గుర్తుతెలియని విషపురుగు కాటేసింది. తీవ్ర అస్వస్థతకు లోనుకాగా, కుటుంబ సభ్యులు కొత్తకోట ప్రభుత్వ ఆస్పత్రికి తరలించి, మెరుగైన చికిత్స కోసం మదనపల్లె ప్రభుత్వ జిల్లా ఆస్పత్రికి తీసుకువచ్చారు.

పోలీస్ కార్యాలయంలో ఘనంగా ఎన్టీఆర్ జయంతి


జిల్లా పోలీస్ కార్యాలయంలో ఎన్టీఆర్ చిత్రపటానికి నివాళులర్పిస్తున్న పోలీసు అధికారులు

కడప అర్బన్ : 'తెలుగు ప్రజల కోసం పాలనాపరంగా పలు సామాజిక సంస్కరణలు అమలు చేసిన ఘనత దివంగత మాజీ ముఖ్యమంత్రి నందమూరి తారక రామారావుకే దక్కుతుందని ఏఆర్ అదనపు ఎస్పీ రమణయ్య పేర్కొన్నారు. బుధవారం జిల్లా పోలీస్ కార్యాలయంలో ఎన్టీఆర్ జయంతి వేడుకలు ఘనంగా నిర్వహించారు. జిల్లా ఎస్పీ ఈజీ అశోక్ కుమార్ ఆదేశాల మేరకు ఎన్టీఆర్ చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులు అర్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఆంధ్రప్రదేశ్ ముఖ్యమంత్రిగా అనేక సేవలందించడంతో పాటు చలనచిత్రాల్లో, నిజజీవితంలోనూ తెలుగుజాతి ఆత్మగౌరవాన్ని, కీర్తిని ప్రపంచ వేదికపై చాటి చెప్పిన మహనీయుడు ఎన్టీఆర్ అన్నారు. ఎన్టీఆర్ తెలుగు ప్రజల హృదయాల్లో చిరస్థాయిగా నిలిచారన్నారు. ఈ కార్యక్రమంలో ఏఆర్ డీఎస్పీ కె.శ్రీనివాసరావు, పోలీస్ సిబ్బంది పాల్గొన్నారు.

కాలం చెల్లిన పద్ధతులైనా కరెక్టేనట!

కడప కార్పొరేషన్ : వైద్య విద్య శాఖలో కాలం చెల్లిన పద్ధతులే కరెక్టేనట.. అభ్యర్థులు ఎదుర్కొన్న సమస్యలు, ఇబ్బందులు వారి దృష్టికి రాలేదట.. ఈ విషయం చెప్పింది ఎవరో కాదు సాక్షాత్తు ప్రభుత్వ మెడికల్ కళాశాల ప్రిన్సిపల్ టి. జమున. ఈనెల 21వ తేదీ సాక్షిలో ప్రచురితమైన 'వైద్య విద్యలో పాత పద్ధతులే' శీర్షికన ప్రచురితమైన వార్తపై ఆమె స్పందించారు. ఆమె ఏం పేర్కొన్నారంటే.. వైద్య విద్య శాఖలో ఇచ్చిన నోటిఫికేషన్‌లో ఎక్కువగా నాల్గవ తరగతి పోస్టులు ఉన్నాయని, ఆ పోస్టులకు పదవ తరగతి విద్యార్హత ఉందని, అభ్యర్థుల వెసులుబాటు కోసమే జిల్లా సెలెక్షన్ కమిటీ డీడీల ప్రతిపాదన చేశారని తెలిపారు. కాగా ఇటీవల ఏపీ హైకోర్టు జిల్లాల వారీగా పోస్టు భర్తీకి ఇచ్చిన నోటిఫికేషన్‌లో అటెండర్ స్థాయి పోస్టులకు కూడా ఆన్‌లైన్‌లో దరఖాస్తులు స్వీకరించారు. చలానా కూడా ఆన్‌లైన్‌లో చెల్లించేలా చర్యలు తీసుకున్నారు. ఈ పోస్టులకు విద్యార్హత 7వ తరగతి మాత్రమేనన్నది ఇక్కడ గమనార్హం. అయినప్పటికీ అభ్యర్థులు ఇంటర్నెట్ కేంద్రాలకు వెళ్లి భారీ స్థాయిలో ఈ పోస్టులకు దరఖాస్తు చేశారు. వైద్య విద్యలో జనరల్ డ్యూటీ అటెండెంట్‌కు పదవ తరగతి విద్యార్హత నిర్ణయించిన అధికారులు వారి వెసులుబాటు కోసమే డీడీలు చెల్లించాలని నిర్ణయించామని చెప్పడం పట్ల విస్మయం వ్యక్తమవుతోంది.

ఆందోళన జయప్రదం చేయాలి


కడప వైఎస్‌ఆర్ సర్కిల్ : జూన్ 2న రాష్ట్ర వ్యాప్తంగా సీపీఐ చేపట్టిన తహసీల్దార్ కార్యాలయాల వద్ద ఆందోళన జయప్రదం చేయాలని సీపీఐ రాష్ట్ర కార్యదర్శి వర్గ సభ్యులు జి. ఈశ్వరయ్య కోరారు. బుధవారం కడప నగరంలోని సీపీఐ కార్యాలయంలో ఆందోళనకు సంబంధించిన పోస్టర్లను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ దశాబ్దాల తరబడి పేదలు సొంత ఇంటి కల నెరవేర్చుకోవడం కోసం అధికారులు, అధికార పార్టీ నేతల చుట్టూ కాళ్లు అరిగేలా తిరుగుతున్నా ఫలితం లేదన్నారు.

ఆగివున్న ట్యాంకరును ఢీకొన్న లారీ


ట్యాంకరును ఢీకొన్న లారీ

ముద్దనూరు : ముద్దనూరు–తాడిపత్రి జాతీయ రహదారిలో బుధవారం తెల్లవారుజామున స్థానిక 4 రోడ్ల కూడలి సమీపంలో ఆగివున్న ట్యాంకరును వెనుక నుంచి వచ్చిన లారీ ఢీకొంది. ఈ ఘటనలో లారీ డ్రైవరుకు స్వల్ప గాయాలయ్యాయి. తాడిపత్రి వైపు నుంచి ఐరన్‌ఓర్ లోడుతో వస్తున్న లారీ ముందు వైపు సిమెంటు లోడుతో ఆగివున్న ట్యాంకరును ఢీకొంది. దీంతో ట్యాంకరు ముందు వైపు నిలబడివున్న మరో లారీని ట్యాంకరు ఢీకొంది. వెనుకవైపు నుంచి ఢీకొట్టిన లారీ ముందు భాగం పూర్తిగా దెబ్బతినగా, ట్యాంకరు వెనుక భాగాన పాక్షికంగా దెబ్బతినింది. తాడిపత్రికి చెందిన లారీ డ్రైవరు సీతారామిరెడ్డికి స్వల్ప గాయాలయ్యాయి.

గూడ్స్ రైలు కింద పడి యువకుడి మృతి


మృతి చెందిన యువకుడు

కడప కోటిరెడ్డి సర్కిల్ : కడప– ఎర్రగుడిపాడు రైల్వే స్టేషన్ల మధ్య మంగళవారం అర్ధరాత్రి గూడ్స్ రైలు కింద పడి ఓ యువకుడు మృతి చెందినట్లు రైల్వే పోలీసులు తెలిపారు. మృతుడు కొండాపురం మండలం చౌటుపల్లి గ్రామానికి చెందిన జి.వర్ధన్(22)గా గుర్తించామన్నారు. మృతికి గల కారణాలు తెలియాల్సి ఉందన్నారు. మృతదేహాన్ని కడప రిమ్స్ మార్చురీకి తరలించి కేసు నమోదు చేశామని తెలిపారు.

నేడు వైఎస్ రాజారెడ్డి శత జయంతి వేడుకలు


వైఎస్ రాజారెడ్డి (ఫైల్)

పులివెందుల : దివంగత మహానేత వైఎస్సార్ తండ్రి, దివంగత వైఎస్ రాజారెడ్డి 100వ జయంతి సందర్భంగా శత జయంతి వేడుకలను గురువారం వైఎస్ కుటుంబ సభ్యుల ఆధ్వర్యంలో ఘనంగా నిర్వహించనున్నారు. పట్టణంలోని డిగ్రీ కళాశాల రోడ్డులో గల వైఎస్సార్ సమాధుల తోటలో ఉన్న వైఎస్ జయమ్మ, వైఎస్ రాజారెడ్డి సమాధుల వద్ద వైఎస్ కుటుంబ సభ్యులు నివాళులర్పించనున్నారు. అనంతరం స్థానిక సీఎస్ఐ చర్చిలో దివంగత వైఎస్ జయమ్మ, వైఎస్ జార్జిరెడ్డి, వైఎస్ రాజశేఖర రెడ్డి, వైఎస్ వివేకానందరెడ్డి, టి.కుమార్ కోటిరెడ్డిల మధుర స్మృతులతో వైఎస్ రాజారెడ్డి శత జయంతి సందర్భంగా అక్కడ ప్రత్యేక ప్రార్థనలు నిర్వహించనున్నారు. అనంతరం అన్నదాన కార్యక్రమాన్ని నిర్వహిస్తారు.

ఇసుక దిబ్బల కోసం తెలుగు తమ్ముళ్ల తగువులాట.!

- చాపాడు మండలం వి. రాజుపాళెంలో టీడీపీ వర్గాల మధ్య ఘర్షణ
- కత్తులు, రాడ్లతో దాడులు.. 14 మందిపై కేసులు నమోదు
- జిల్లాలో మహానాడు వేళ టీడీపీ వర్గీయుల మధ్య బయటపడ్డ విభేదాలు


తీవ్రంగా గాయపడిన పవన్‌కుమార్



తలకు గాయమైన మధు, మహేష్

సాక్షి టాస్క్‌ఫోర్స్ : అధికారం వచ్చిందే తడవు అన్నట్లుగా టీడీపీ వర్గీయులు పేట్రేగిపోతున్నారు. మనకెవరూ అడ్డూ, అదుపు లేరనేలా ఆక్రమణలకు పాల్పడుతున్నారు. ఈ క్రమంలో ఆక్రమణల్లో తలమునకలైన టీడీపీ వర్గీయుల్లోని ఇరువర్గాలకు చెందిన వారు ఒకరిపై మరొకరు దాడులకు తెగబడుతున్నారు. చాపాడు మండలం వి.రాజుపాళెం గ్రామానికి చెందిన టీడీపీ వర్గీయులు మంగళవారం పట్టపగలే కత్తులు, రాడ్లు, కర్రలతో దాడులు చేసుకున్నారు. రాజుపాలెం గ్రామ సమీంపలోని పెన్నానది పరివాహకంలో సర్వే నెంబరు 490లో ప్రభుత్వ ఇసుక దిబ్బలు ఉన్నాయి. దీనికి ఇరువైపులా భూములు సాగు చేసుకుంటున్న రాజుపాలెంకు చెందిన టీడీపీలో ఒక వర్గానికి చెందిన పల్లెం శ్రీనివాసులు, వెంకటసుబ్బయ్య, మరో వర్గానికి చెందిన నలసింగ్ పెద్ద కుల్లాయప్ప, చిన్న కుల్లాయప్ప కుటుంబాలకు చెందిన వారు ఇసుక దిబ్బల కోసం మంగళవారం ఘర్షణ పడ్డారు. కొన్ని రోజుల క్రితం ఇదే విషయమై ఇరువర్గాల మధ్య జరిగిన ఘర్షణలో పలువురు గాయపడ్డారు. మంగళవారం కూడా కుల్లాయప్ప కుటుంబీకులు ఇసుక దిబ్బల నుంచి ఇసుకను తరలిస్తుండగా పల్లెం శ్రీనివాసులు కుటుంబీకులు అడ్డుకునేందుకు వెళ్లి ఘర్షణ పడ్డారు. ఈ ఘర్షణలో కత్తులు, ఇనుప రాడ్లు, కర్రలతో దాడులు చేసుకున్నారు. ఈ దాడుల్లో విచక్షణా రహితంగా కొట్టుకున్నారు. తీవ్రంగా గాయపడిన పవన్‌కుమార్‌ను కర్నూలుకు, తలకు గాయమైన మధును కడప రిమ్స్‌కు తరలించగా, మహేష్ అనే వ్యక్తి ప్రొద్దుటూరు ప్రభుత్వ ఆసుపత్రిలో చికిత్స పొందుతున్నారు. ఈ ఘర్షణపై ఇరువర్గాల ఫిర్యాదు మేరకు ఇరువర్గాలకు చెందిన 14 మందిపై కేసులు నమోదు చేశారు. జిల్లాలో టీడీపీ ప్రతిష్టాత్మకంగా మహానాడు కార్యక్రమం నిర్వహిస్తుండగా జన సమీకరణ కోసం ఆయా నియోజకవర్గాల నుంచి జనాలను తరలించే పనుల్లో అధికార పార్టీ నేతలు బిజీగా ఉండగా రాజుపాళెం గ్రామంలో టీడీపీ వర్గీయులు ఘర్షణకు దిగడం గమనార్హం.

పెన్నానదిలో వందల ఎకరాల్లో ఆక్రమణలు..

మండలంలోని రాజుపాళెం, తిప్పిరెడ్డిపల్లె గ్రామాల మధ్య గల పెన్నానది పరివాహకంతో పాటు నదిలో ఇసుక దిబ్బల్లో వందల ఎకరాల్లో భూములు ఆక్రమణకు గురయ్యాయి. సర్వే నెంబర్లు 487, 488లలో 7.25 ఎకరాల ఆయకట్టు ఉండగా, 489–2లో 22 ఎకరాలు, 490లో 20 ఎకరాలకు పైగా ఇసుక దిబ్బలు ఉండగా, 538లో వంద ఎకరాలకు పైగా ఏటి పోరంబోకు ఉంది. ఈ స్థలం అంతా ఆక్రమణకు గురై వ్యవసాయ భూములుగా మారాయి. ఈ క్రమంలో ఆక్రమణకు గురైన పొలాల మధ్య ఉన్న ఇసుక దిబ్బలలో ఉన్న ఇసుకను పొలాలకు తోలుకునేందుకు, ఇసుక తొలగించి వ్యవసాయ భూమిగా మార్చుకునేందుకు టీడీపీ వర్గీయుల మధ్య తరచూ ఘర్షణలు జరుగుతుండటం చర్చనీయాంశంగా మారింది.

సమస్యాత్మక దిబ్బలను పరిశీలించిన రెవెన్యూ అధికారులు..

మండలంలోని రాజుపాలెం గ్రామ సమీపంలో టీడీపీ వర్గీయుల మధ్య ఘర్షణకు కారణమైన పెన్నానది పరివాహకంలో ఇసుక ఇబ్బలను తహసీల్దారు రమాకుమారి తమ సిబ్బందితో కలసి పరిశీలించారు. ఈ ఇసుక దిబ్బలు పూర్తిగా ప్రభుత్వ పరిధిలోనివని, వీటిపై ఎవరికీ హక్కు లేదని, హక్కు ఉన్నట్లు పత్రాలు తీసుకువస్తే విచారించి పరిశీలిస్తామని ఇరువర్గాలకు తెలిపారు.